నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ రీజియన్
బుధవారం | డిసెంబర్13,2023 | www.navatelangana.com

కేసీఆర్‌ను పరామర్శించిన చిరుమర్తి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్‌ని మంగళవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిసి పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, భగవంతుడి ఆశీస్సులు కేసీఆర్‌పై ఉంటాయని ఆయన కాంక్షించారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ - భువనగిరి



నార్మాక్స్ మదర్ డెయిరీ మాజీ చైర్మెన్ పోతంశెట్టి చక్రపాణి ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోతంశెట్టి చక్రపాణి నిరాడంబర జీవితాన్ని గడిపిన ప్రజాసేవకుడని పేర్కొన్నారు. నివాళు లర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ఉన్నారు.

తొందరేమి లేదు...

బారులెందుకు?

గ్యాస్ ఈ కేవైసీ కోసం బారులు తీరుతున్న వినియోగదారులు

- అప్‌డెట్ చేయడం కోసమేనంటున్న డిస్ట్రిబ్యూటర్లు
- జిల్లాలో 5,58,021 గ్యాస్ కనెక్షన్లు

నవతెలంగాణ నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.500కే రాయితీ పథకం కోసం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఇంకా విధివిధానాలు రూపొందించలేదు. అయినా ఈ కేవైసీ చేసుకుంటేనే రాయితీ వస్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఇవ్వాలనుకునే రాయితీ గ్యాస్‌కు ఈకేవైసీతో సంబంధం లేదని గ్యాస్ ఏజెన్సీల నిర్వహకులు స్పష్టం చేస్తున్నారు. గత రెండు నెలల నుండి గ్యాస్ ఏజెన్సీ సభ్యులు ఈకేవైసీ చేసుకోవాలని చెబుతున్న చాలామంది పట్టించుకోలేదు. ప్రభుత్వం మారడంతో ఈ కేవైసీ లేనిది రాయితీ గ్యాస్ పథకం వర్తిస్తుందో లేదో అని ప్రస్తుతం వినియోగదారులు పరుగులు తీస్తున్నారు. ఈ కేవైసీ కోసం వేలిముద్ర తప్పనిసరి. ఎవరి పేరు మీదైతే గ్యాస్ నమోదయ్ ఉంటుందో వారే ఏజెన్సీల వద్దకు వెళ్లి వేలి ముద్ర వేసి వారి సెల్ నెంబర్ ను అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ కార్డు లేదా గ్యాస్ పాసుబుక్ తో వెళ్తే ఏజెన్సీలో ప్రత్యేక కౌంటర్ లో ఈ కేవైసీ చేస్తున్నారు.

దేనికోసం ఈ-కేవైసీ..

గ్యాస్ కనెక్షన్ల సంఖ్యను తగ్గించడం కోసమే ఈకేవైసీ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గ్యాస్ వాడే వారిని గుర్తించి వాడని వారు, చనిపోయిన వారు, డబుల్ కనెక్షన్ ఉన్నవారని



తొలగించే ఉద్దేశంతోనే రేషన్ షాపులో చేస్తున్న మాదిరిగా గ్యాస్ సిలిండర్‌కు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లు ఈ కేవైసీ చేస్తున్నారు. సివిల్ సప్లై అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే కేవలం ఆయిల్ కంపెనీవారి ఆదేశాలతోనే గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఈ కేవైసీని చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు..

గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి వారు ఈ కేవైసీ చేయించుకోవాలని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు చెప్పడంతో ఈ కేవైసీ కోసమని ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు గ్యాస్ ఏజెన్సీల వద్ద గత రెండు, మూడు రోజులుగా వినియోగదారులు భారులు తీరారు. వాస్తవానికి ఈ కేవైసీ విషయం గూర్చి జిల్లా అధికారులకు ఎలాంటి ఆదేశాలు ఇప్పటివరకు అందలేదు. సివిల్ సప్లై కమిషనర్ నుండి కూడా ఎలాంటి సమాచారం రాలేదు. మొదటగా ప్రభుత్వం ఆ తర్వాత జిల్లా కలెక్టర్, ఆ తర్వాత అదనపు కలెక్టర్, అనంతరం డిఎస్ఓ కు ఆదేశాలు అందిన తర్వాతనే ఈకేవైసీని ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ఇదేమీ లేకుండా ఆయిల్ కంపెనీ వారు డిస్ట్రిబ్యూటర్ల కు చెప్పడం తో డిస్ట్రిబ్యూటర్లు ఈ కేవైసీ చేస్తున్నారు. ఈ కేవైసీ చేయకపోతే గ్యాస్ రాదేమోనని భయంతో గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతూ ఈకేవైసీ కోసం నానా తంటాలు పడుతున్నారు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు..

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,580,21 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో జనరల్‌లో సింగిల్ గా ఉన్నవి 246193 కనెక్షన్లు ఉండగా, డబుల్ కనెక్షన్లు ఉన్నవి 142589, ఉజ్వల కనెక్షన్లు 59744, దీపం కనెక్షన్లు 72209, సిఎస్ఆర్ 37286 కనెక్షన్లు ఉన్నాయి.

అప్‌డెట్ చేయడం కోసమే..

ఇదే విషయమై గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను వివరణ కోరగా ఈకేవైసీని గత రెండు నెలలుగా చేస్తున్నామని తెలిపారు. చివరి తేదీ అంటూ ఏమీ లేదని వినియోగదారులు ఎప్పుడైనా ఈ కేవైసీ చేయించుకోవచ్చని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

మాకు ఎలాంటి ఆదేశాలు లేవు: వి వెంకటేశ్వర్లు (డీఎస్ఓ)

ఆయిల్ కంపెనీ వాళ్ళు డిస్ట్రిబ్యూటర్లకు ఈ కేవైసీ గూర్చి చెప్పినట్లు తెలిసిందని, ఎందుకు చెప్పారో తమకు కన్సర్మేషన్ లేదన్నారు. కమిషనర్ నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.



రైతు ఉద్యమ నేతలపై...

అక్రమ కేసులు ఎత్తివేయాలని ధర్నా

నవతెలంగాణ -భువనగిరిరూరల్

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని చేపట్టిన ఉద్యమంలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని చేయాలని, రైతు నాయకులపై నిర్బంధాలను ఆపాలని, రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం (డిసెంబర్ 12 న సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్రకమిటీ పిలుపు లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ , కొల్లు రాజయ్య కల్లెం అడవయ్య, కేమిడి ఉప్పలయ్య (ఏఐకేఎంఎస్) మామిడ్నాల బిక్షపతి, మంగ నర్సింహులు(ఏ ఐ కె ఏస్) రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడారు.రైతు వ్యతిరేక మూడు కేంద్ర చట్టాలను రద్దు చేయాలని మద్దతు ధరల గ్యారెంటీ చ ట్టం చేయాలని విద్యుత్తు సవరణ బిల్లు -20 20 రద్దు చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలన డిమాండ్లతో 13 నెలల పాటు సాగిన రైతు ఉద్యమ సమయంలో 730 మంది రైతులు చనిపోయారు.వేలాది మంది రైతులపై అక్రమ కేసులు మోపబడినాయన్నారు. ఉద్యమ సమయంలో మోపినటువంటి కేసులకు సంబంధించి తిరగతోడుతూ రైతు ఉద్యమ నాయకులను నిర్బంధించడానికి ప్రయత్నించటం, వారి ప్రయాణాలను మార్గమధ్యంలోనే నిషేధించడం లాంటి దుర్మార్గమైన చర్యలకు కేంద్రపాలకులు పాల్పడుతున్నారన్నారు. ఈ చర్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు నేరేడు స్వామి, బబ్బురి పోశెట్టి, ర్యాకల శ్రీశైలం, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ జనార్ధన్, ఏ ఐ టి యు సి నాయకులుఇమ్రాన్ , వంగాల మధు సూదన్ రెడ్డి గడ్డం మంకయ్య ఎలగందుల సిద్దులు, సహదేవ్, కొటేష్ లు పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనను ప్రజలు సహించరు

- నియంతలకు ప్రజల చేతిలో ఓటమి తప్పదు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్



నవతెలంగాణ -రామన్నపేట

ఏ పాలకుడైనా నియంతృత్వ పాలన సాగిస్తే ప్రజలు సహించరని, ప్రజా వ్యతిరేక విధానాలతో నియంత పాలకులకు, ఏ ప్రభుత్వాలకైనా ప్రజల చేతిలో ఓటమి తప్పదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి .జహంగీర్ తెలిపారు. స్థానిక ఆ పార్టీ మండల కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ మండల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంకు ప్రజలు నూతన రాష్ట్రంలో పట్టంకడితే పాలనలో వైఫల్యం చెందారని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను పార్టీ కార్యకర్తలకే కేటాయించి, పేద ప్రజలను విస్మరించిందని విమర్శించారు. ప్రజా సమస్యలు వినకుండా ప్రజలకు అందుబాటులోకి రాకుండా పాలన కొనసాగిస్తే ప్రజలు ఓటు ఆయుధంతో గద్దె దించారన్నారు. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచి ప్రభుత్వ పథకాలను గ్రామ సభల ద్వారా నిర్ణయించి ఎంపిక చేసి ప్రతీ పేదవానికి న్యాయం చేయాలన్నారు. నకిరేకల్ నియోజకవర్గ సమస్యలపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించి, గత పభుత్వ తప్పిదాలను పునరావృతం కాకుండా చూడాలన్నారు. విద్యా, వైద్యంపై దృష్టి సాదించి రాజకీయాలకతీతంగా పథకాలు అందివ్వాలన్నారు. సీపీఐ(ఎం) ప్రజా సమస్యలు వెలికితీసి నిత్యం ప్రజల పక్షాన పోరాటం నడుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీసభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, కూరెళ్ళ నర్సింహచారి, బల్గూరి అంజయ్య, బోయిని ఆనంద్, గాదె నరేందర్, వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్, గన్నెబోయిన విజయభాస్కర్, వేముల సైదులు, బావండ్లపల్లి బాలరాజు, యండి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో

భూమి మాయం

- ఫిర్యాదు చేస్తే.. ఉన్న భూమి గల్లంతు

నవతెలంగాణ-మిర్యాలగూడ



రెవెన్యూ అధికారుల మాయతో రైతుల భూములు మాయమవతున్నాయి. బాధితులు తమ భూములకు రక్షణ కల్పించాలంటూ ఫిర్యాదులు చేసినా ఉన్న భూమీ గల్లంతు అయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.. అందులో భాగంగానే మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన రైతు రామయ్య భూమి మాయమైన సంఘటన వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన గొడ్డేటి రామయ్యయాదవ్‌కు తుంగపాడు రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 630అ లో 30 గుంటలు, సర్వే నెం.630ఆలో 25గుంటల భూమి మొత్తం 1.15ఎకరం భూమి వారసత్వంగా సంక్రమించింది. తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పాస్‌బుక్‌లో సైతం రామయ్య భూమి వివరాలు నమోదు చేశారు. కాగా ధరణి వెబ్‌సైట్‌లో 25గుంటల భూమి రికార్డుల్లో ఎక్కలేదు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్, ఆర్డీవోలను కలిసి పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో జూలై 13, 2022న గ్రీవెన్స్ రోజున జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ భూమి ఆన్‌లైన్‌లో పహణీలో నమోదు కాలేదని ఆయన వాపోతున్నారు. కాగా రామయ్య ఇటీవల తన అవసరాల నిమిత్తం ఉన్న భూమిని అమ్మేయాలనుకోని పహణీలకై ప్రయత్నించగా మిగతా 30 గుంటల భూమి సైతం రికార్డుల నుంచి మాయమవడంతో అవాక్కు అయ్యాడు. వారసత్వంగా సంక్రమించిన భూమిని రికార్డుల నుంచి తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నా భూమిని కాజేయాలని చూస్తున్నారు: రామయ్య యాదవ్

'నా పట్టా భూమి 25గుంటలు మొదట రికార్డుల నుంచి మాయం చేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా భూమి ఆన్‌లైన్‌కు ఎక్కలేదు. ఉన్న 30 గుంటల భూమి ఇప్పుడు ధరణిలో కనిపించడం లేదు. నాకు చదువు రాదని ఎవరో నా భూమిని కాజేయాలని చూస్తున్నారు. అధికారులు స్పందించకపోతే హైద్రాబాద్‌లోని ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తా' అంటూ తెలిపారు.



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- అట్టహాసంగా ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడలు
- హాజరైన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , కలెక్టర్

హనుమంతు కె జెండగే

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభమైన విషయం తెలిసినదే అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు మంగళవారం ఆనందోత్సవాల తో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆటల పోటీలలోపాల్గొని కబడ్డీ ఆడి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. క్రీడలు దేహ దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని, కృషి ఉంటే విద్యార్థులు రుషులవుతారని తెలిపారు. రాష్ట్ర, జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని పేర్కొన్నారు. తనకు ఆటలంటే చిన్నప్పటి నుంచి మక్కువ అని తెలిపారు. కలెక్టర్ కొండిబా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాన్ని సాధించాలని తెలిపారు. విద్యార్థులు కష్టపడితే ఎవరెస్టు శిఖరానైనా అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు నరసింహ చారి, శ్రీనివాస్ ,ఆర్డీవో అమరేందర్ ఆర్ సి ఓ, రజిని, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ ,పిడి వెంకటేశ్వర్లు,పీఈటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటు మొదటి డిమాండ్‌ను నెరవేర్చాలి

- ఎమ్మెల్యే ను కోరిన మిర్యాలగూడ వాసులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు మొదటి డిమాండ్ ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వెంటనే నెరవేర్చాలని మిర్యాలగూడ జిల్లా సాధన సమితి నాయకులు , బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ దశరథ్ నాయక్, డాక్టర్ జాడి రాజు, మారం శ్రీనివాస్,రాపోలు పరమేష్ లు కోరారు.మిర్యాలగూడను జిల్లా చేయాలని, ఎన్నికల సమయంలో మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు కోసం కృషి చేస్తానని మొదటి హామి ఇచ్చి గెలుపొందిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని మంగళవారం గెలుపొందిన సందర్భంగా అభినందనలు తెల్పడంతో పాటు మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు విషయమై తక్షణం కృషి చేయాలని జిల్లా సాధన సమితి అధ్వర్యంలో కోరారు.ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి నేతలు మాట్లాడుతూ ప్రజా అభిప్రాయానికి అనుగుణంగా జిల్లా ఏర్పాటు కోసం కృషి చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.జిల్లా ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చలని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు బెజ్జం సాయి,మురళీ యాదవ్, జ్వాలా వేంకటేశ్వర్లు, దుర్గయ్య, సుధాకర్,అంజయ్య, సిరసాల శ్రీనివాస్, మోసీన్,తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ఓగా బొరెడ్డి అయోధ్య రెడ్డి



నవతెలంగాణ-తుర్కపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి గ్రామానికి చెందిన బొరెడ్డి అయోధ్య రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సీపీఆర్ఓగా నియమితులయ్యారు. ఆయన మార్చి10 1973లో బొరెడ్డి సత్తిరెడ్డి, భారతమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ఎంసీజే, ఎల్ఎల్‌బీ చదివారు. పదో తరగతి వరకు తుర్కపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ లో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ జగదేవపూర్, ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాల భువనగిరిలో డిగ్రీ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంసీజే (కమ్యూనికేషన్ జర్నలిజం), కేవీ రంగారెడ్డి లా కాలేజీలో ఎల్.ఎల్.బీ తుర్కపల్లి ఉదయం కంట్రిబ్యూటర్ గా వృత్తిని ప్రారంభించి. ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ గా, బ్యూరో ఇంచార్జ్ , ఎడిటోరియల్ బోర్డు మెబర్‌గా పనిచేశారు. అనంతరం ఆంధ్రజ్యోతి, సాక్షి హైదరాబాద్ బ్యూరోలో పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించారు.2018లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తికాలం రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. భారత్ జోడో యాత్రలో మీడియా కమిటీ కన్వీనర్ గా, 2023 ఎన్నికల్లో వార్ రూమ్ కో-ఆర్డినేటర్ గా క్రియాశీలకంగా పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొటరిలో ప్రస్తుతం సీపీఆర్ఓగా ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసిన మహేష్

నవతెలంగాణ -రాజపేట

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను ఐఎన్‌టీయూసీ-327 భువనగిరి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంజ మహేష్ మంగళవారం ఉదయం యాదగిరిగుట్టలో తన నివాసంలోమర్యాదపూర్వకంగా కలిశారు.,శాలువాతో,పూల బొకేతో, ఫోటో బహుకరణ ఇచ్చి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షులు,మోత్కూరి ఐలయ్య,డివిజన్ సెక్రెటరీ, గ్యార నర్సింగరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యాదయ్య

నవతెలంగాణ- రామన్నపేట





గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐజీడిఎస్యు, ఎన్ యు జి డి ఎస్ సంఘాల దేశవ్యాప్త పిలుపుమేరకు మంగళవారం స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్ వద్ద రామన్నపేట ఎస్ఓ పరిధిలోని గ్రామీణ తపాల ఉద్యోగులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి ఆర్థిక ఉన్నత కల్పించాలని, 8 గంటల పనిని పెన్షన్ను ఐదు లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమానవేతనం అనే సూత్రం ప్రకారం కొత్తగా నియమించబడిన జిడిఎస్‌లకు 5 గంటల పనికి సెకండ్ టిఆర్ఎ ఇవ్వాలని కోరారు. సమస్యను పరిష్కారం అయ్యేంతవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ నిరోధిక సమ్మెలో సంఘం ఉపాధ్యక్షులు జి లింగస్వామి, మతిన్, ప్రభాకర్ చారి, గౌసు, యాదయ్య, కేతనాయక్, శ్రీకాంత్, శివ కిరణ్, శివ ప్రసాద్, సాయి, అరవింద్, రమాదేవి, సునీత, మౌనిక, వాజిద్, హరిప్రసాద్, గోపి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర సంఘాల పిలుపుమేరకు మంగళవారం మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు బల్లెం రామస్వామి,కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మారయ్య,చిరంజీవి, జంగయ్య ,వెంకటరెడ్డి, జగదీష్, భాస్కర్, వంశీ, వీరబాబు, బైకని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

దేగబాబు ఫంక్షన్‌హాల్‌కు వెళ్లే దారి పునరుద్ధరణ

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని దేగబాబు ఫంక్షన్‌హాల్‌కు వెళ్లే దారిని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అక్రమంగా మూసివేయించిన విషయం విధితమే.ఆ డివైడర్ దారిని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి చొరవతో మంగళవారం పునరుద్ధరించారు. సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఎర్నేని వెంకటరత్నంబాబు, అల్తాఫ్ హుస్సేన్, దేగబాబు మూసిన దారిని తొలగించి ప్రజలకు సౌకర్యం కలిగించడం చాలా సంతోషంగా ఉందన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన బిక్కుమల్ల సర్పంచ్,గ్రామస్తులు

నవతెలంగాణ-నూతనకల్

తుంగతుర్తి శాసనసభ సభ్యునిగా నూతనంగా ఎన్నికైన మందుల సామేల్‌ను బిక్కుమల్ల సర్పంచ్ బొల్లేపల్లి అశోక్,సీనియర్ నాయకులు రామసహాయం ,మమత, అనూప్‌రెడ్డిలతో పాటు గ్రామస్తులు మంగళవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలందరికీ అందేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మద్దెల గంగరావు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నరేష్,ఉపాధ్యక్షుడు సుధాకర్, మోర ఉపేందర్,గణేశ్, బద్రి, ఆంజనేయులు,నరేశ్‌చారి, శ్రీను,పాషా, వీరస్వామి, సాయి, నాగరాజు, శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.



గ్యాస్ ఏజెన్సీల వద్ద ఇబ్బందులు

- బారులు తీరుతున్న వినియోగదారులు
- 500కే గ్యాస్ ఇవ్వడం లేదు
- కేవలం ఈ కేవైసీ మాత్రమే
- డీఎస్ఓ- మోహన్‌బాబు

నవతెలంగాణ-సూర్యాపేట



కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన రూ.500 సిలిండర్ పొందాలి అంటే ఈ-కేవైసీ అప్డేడ్? చేసుకోవాలని వస్తున్న అసత్య ప్రచారాలతో వినియోగదారులు జిల్లా వ్యాప్తంగా గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరారు. ఉదయం 7గంటల నుంచి లైన్ కట్టి తమ కేవైసీని అప్డేడ్? చేయించు కుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 లకే సిలిండర్ ఇస్తామన్న ప్రకటన అమలు కాక ముందే జనాలు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గత కొన్ని రోజులుగా గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీ ప్రక్రియను కొనసాగిస్తున్నాయి.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మారడం వల్ల ఈకేవైసీ రూ.500 సబ్సిడీ గ్యాస్ కోసమేననే భావనతో కనెక్షను దారులు ఏజెన్సీల ముందు వరుస కడుతున్నారు.ఈ కేవైసీ పై సదరు గ్యాస్ ఏజెన్సీ వారు వినియోగ దారులకు అవగాహన కల్పించకపోవడంతో మూడు రోజుల నుంచి వందల సంఖ్యలో మహిళలు, వినియోగదారులు ఉదయం నుంచి లైన్ కడుతున్నారు.జిల్లావ్యాప్తంగా పట్టణ, మండలంలోని వివిధ గ్రామాల వినియోగదారులు హెచ్పి,భారత్, ఇండియన్ తదితర గ్యాస్ ఏజెన్సీల వద్దకు వస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.ఇదిలావుండగా ఈ పథకం కోసం ఈ-కేవైసీ చేయించుకోకపోతే సబ్సిడీ రాదని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇంకేముంది ఈ- కేవైసీ చేయించు కునేందుకు మహిళలందరూ తమ ఆధార్‌కార్డులు పట్టుకుని గ్యాస్‌ఏజెన్సీల ముందు వేలిముద్రలు వేయడానికి బారులు తీరుతున్నారు. ఇదిలావుండగా కేంద్ర ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ మాత్రం ఈ-కేవైసీ చేసుకొని మహిళలందరు వెంటనే చేయించుకోవాలని ప్రకటించింది. కాగా ఈ ప్రకటనకు రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకానికి లింకు పెట్టి వార్తలు ప్రచారం కావటంతో మహిళలు ఆందోళన పడ్డారు. వందల సంఖ్యలో వచ్చిన కస్టమర్లను అదుపు చేయలేక పోవడంతో పోలీసులు వచ్చి కంట్రోల్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 7 గంటల వరకు పదుల సంఖ్యలో వస్తున్న మహిళలు పది గంటల వరకు వందల సంఖ్యలో గుమిగూడుతున్నారు. వందల సంఖ్యలో వస్తున్న వినియోగదారులను ఈ కేవైసీ చేయడానికి తగిన వనరులను ఏర్పాటు చేయక పోవడం, ఒక్కరే కంప్యూటర్ ఆపరేటర్‌తో రోజుకు 10 నుండి 20 మంది కస్టమర్స్ ఈకేవైసీ చేస్తూ మిగతా వారికి వాపస్ పంపుతున్నారు.ప్రభుత్వం అమలు చేసే రూ.500 సిలిండర్ పథకానికి, ఈకేవైసీకి ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడంలేదని, తమ దుకాణాల ముందు వచ్చి బారులు తీరుతున్నారని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు వృద్దులు మొదలుకొని, చంటి పిల్లలతో తల్లులు, మహిళలు ఈకేవైసీ కోసం ఉదయమే వచ్చి ఏజెన్సీల ముందు నానాతంటాలు పడుతున్నారు.ఈకేవైసీకి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకానికి ఎలాంటి సంబంధంలేదని చెప్పినా ప్రజలు వినడం లేదని సిబ్బంది తెలిపారు. గ్యాస్ కనెక్షన్‌కు కేవైసీ ఎప్పుడైనా అనుసంధానం చేసుకోవచ్చుని, దానికి చివరి గడువు లేదని గ్యాస్ కార్యాలయ సిబ్బంది అన్నారు.కేవలం ఉజ్వల వినియోగదారులు మాత్రం మార్చి 31వరకు కేవైసీ చేసుకోవాలని వారు పేర్కొంటున్నారు.ఇదిలా ఉంటే మరోవైరు ప్రజలు ఏజెన్సీ నిర్వాహకులు చెప్తున్నా వినిపించుకోకుండా సమస్యలు లేకుండా సమయాన్ని కేటాయించి ఈ-కేవైసీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్యాస్ కనెక్షన్?కు కేవైసీ అప్డేట్ చేయాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరికొందరు మాత్రం కంప్యూటర్ ఆపరేటర్లను పెంచి త్వరగా పూర్తి చేయాలని గ్యాస్ కస్టమర్లు కోరుతున్నారు.దీని పై ఏజెన్సీ వారు, అధికారులు అవగాహన కల్పించక పోవడంతో వినియోగదారులు కేవైసీ వేలి ముద్రలు కోసం ఉదయం నుండి సాయంత్రం వరకు గ్యాస్‌ఏజెన్సీల వద్ద పడిగాపులు గాస్తున్నారు.

రూ.500 సిలిండర్‌కు, ఈకేవైసీకి సంబంధం లేదు

సూర్యాపేట డీఎస్ఓ-మోహన్‌బాబు

గ్యాస్ కనెక్షన్ దారులు ఈ కేవైసీ చేయించు కోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. ఈకేవైసీ ఉంటేనే రూ.500 రాయితీ గ్యాస్ సిలిండర్ ఇస్తారనే ప్రచారం నమ్మొద్దు. ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీలో డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.ఈకేవైసీకి ఎలాంటి గడువు లేదని, ఇది ఎప్పుడైనా చేసుకోవచ్చునే విషయం వినియోగదారులు గమనించాలి.

ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ కోటాచలం

నవతెలంగాణ-అర్వపల్లి

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ మహిళలకు హాస్పిటల్‌లో సాధారణకాన్పులయ్యేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోజువారీగా వచ్చే వైద్యసిబ్బందికి రక్తపరీక్ష నిర్వహించాలన్నారు.15శాతం రక్త పరీక్షలు తీసి టీ హబ్ సెంటర్ సూర్యాపేటకు పంపించాలని ఆదేశించారు.మండలపరిధిలోని వీధి సబ్‌సెంటర్‌లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు నిర్వహించా లన్నారు.ఈ కార్యక్రమములో డాక్టర్. మణిదీప్,సీహెచ్.చరణ్, కె.లక్ష్మీనారాయణ, ల్యాబ్‌టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ కుంభం.వీరయ్య పాల్గొన్నారు.



క్రీస్తు బోధనలు అనుసరణీయం

- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



మానవులు ఎప్పుడూ ప్రేమను, కరుణను, క్షమను కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చేసిన బోధనలు మానవాళికి అనుసరణీయమని శాసనసభ్యులు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు.మంగళవారం స్థానిక లివింగ్ గాడ్ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ ను పురస్కరించుకొని పాస్టర్లకు, సువార్తికులకు,పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి శ్యాంసన్ ఆధ్వర్యంలో జరిగిన బట్టల పంపిణీ కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖఃశాంతులతో ఉంటుందన్నారు.ఏసుక్రీస్తు ఈ లోకంలోని ప్రజలందరికీ ప్రేమ, అప్యాయతను నేర్పించారని, ఎదుటివారిని ప్రేమించేగుణం మనలో ఉండాలని, ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలన్నారు.ఎన్నో ఏళ్లుగా శ్యాంసన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాస్టర్లతో కలిసి కేక్ ని కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెవరెండ్ ఎం.ప్రభుదాస్,జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు పూర్ల శశికాంత్, పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షులు మీసాల గోవర్ధన్, పట్టణ అధ్యక్షులు మీసాల ప్రభుదాస్,ఫాదర్ మరియన్న, పాస్టర్ జవహర్లాల్, జాకబ్, బాబురావు, డేవిడ్ రాజ్, సత్య ప్రకాష్, లింగానాయక్, రాజరత్నం, బొడ్డు మత్తయ్య, సాల్మన్ రాజు, మచ్చ ఏసుపాదం, మని దాసు, పద్యం రాజు, కోట సామ్సన్, జాన్, దుర్గాప్రసాద్, చలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టు వైస్‌కెప్టెన్‌గా షేక్‌సిద్దిఖ్ ఎంపిక అభినందనీయం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్



అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున పాల్గొనే రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్రికెట్ జట్టుకు ఉపాధ్యాయ వృత్తిలో మొట్టమొదటిగా వైస్‌కెప్టెన్‌గా ఎంపికై చరిత్ర సృష్టించిన కోదాడ వాసి షేక్‌సిద్దిఖ్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మంగళవారం అభినందించారు.షేక్ సిద్దిఖ్ ప్రస్తుతం హుజూర్‌నగర్ నియోజకవర్గం పాలకవీడు మండలంలో ఎల్లాపురం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పని చేస్తున్నారు.తెలంగాణ జట్టు ఈ నెల 13 నుండి 23 వరకు దేశ రాజధాని ఢిల్లీ నగరం వేదికగా ఏఐసీఎస్ 2023లో పాల్గొనబోతుంది.గతంలో ఈ జట్టులో అప్పటి ఐఏఎస్,ఐపీఎస్ ఆఫీసర్స్ ఆడారు.సిద్దిఖ్ ఎంపికైనందుకు జిల్లా యువజన క్రీడాధికారి వెంకటరెడ్డి,ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిఖ్, ఎంఈఓ సలీం షరీఫ్,చత్రునాయక్, ఉపాధ్యాయ సంఘం నాయకులు కొణతం వెంకటరెడ్డి,కోదాడ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డా కొత్తపల్లి సురేష్, సభ్యులు దర్గయ్య,చందా శ్రీనివాస్, నరేష్,నాయిని నాగేశ్వర్‌రావు, సురేష్, జబ్బార్,ఖాజామియా, ఉస్మాన్, శ్రీను, శ్రీకాంత్, షఫీ,సురేష్,జహీర్,శ్రీనునాయక్, పాలకీడు కాంప్లెక్స్ హెచ్ఎం డి.ఉపేందర్, పాఠశాలహెచ్ఎం వెంకటరెడ్డి, సైదిరెడ్డి,మండల ఉపాధ్యాయులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

గ్రంథాలయాన్ని పరిశీలించిన ఆర్డీవో



నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను రీడర్స్‌ను అడిగి తెలుసుకున్నారు.పోటీ పరీక్షలకు అందుబాటులో ఉన్న పుస్తకాలు,కావాల్సిన పుస్తకాలు సబ్జెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు గ్రంథాలయంలో మరుగుదొడ్ల సమస్య,ఫర్నీచర్‌తో పాటు పోటి పరీక్షలకు అవసరమైన మెటీరీయల్ తదితర సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు.కాగా ఆయన స్పందించి సమస్యలుకలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారిస్తామన్నారు. కాగా ఆర్డీవో స్వయంగా వచ్చి నిరుద్యోగులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి భరోసా ఇవ్వడం పట్ల నిరుద్యోగులు ఆర్డీఓకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-నూతనకల్

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చిన మహిళా పేషెంట్ల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని వారిపట్ల ఆరోగ్య సిబ్బంది చేస్తున్న వైద్య సేవా విధివిధానాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి చూసి వైద్య సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ఆశ్రిత, పీహెచ్ఎస్ తారమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపాక శ్రీనివాస్ నాల్గో వర్థంతి

నవతెలంగాణ-చిలుకూరు

కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు, పార్టీకి పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ మృతి వలన తీవ్రమైన నష్టం జరిగిందని స్వాతంత్ర్య సమరయోదుడు,సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి దొడ్డ నారాయణరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ నాల్గో వర్థంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ జ్ఞాపకార్థకంగా 2024 కాలెండర్‌ను నిర్మాణం చేసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, సాయిబెల్లి, కస్తూరి సత్యం,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రైతుల భూముల్లో నుండి అనుమతులు లేకుండా 11కేవీ విద్యుత్‌లైన్

- ప్రమాదం పొంచి ఉందని

గుడిబండ రైతుల ఆందోళన

నవతెలంగాణ-కోదాడరూరల్



పట్టణంలోని గుడిబండ రోడ్డులో పెట్రోల్ బంక్ వెనుక గల పొలాల నుండి ఇటీవల కొత్తగా నిర్మిస్తున్న తేజ రైస్ ఇండస్ట్రీ వరకు రైతుల అనుమతులు లేకుండా వారి పొలాల నుండి 11 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల వ్యవసాయపనులకు ఆటంకంగా మాత్రమే కాక ప్రమాదకరంగా మారే ఈ విద్యుత్‌లైన్ ఏర్పాటును నిలిపివేయాలని గుడిబండ గ్రామ రైతులు విద్యుత్ అధికారులను అడ్డుకున్నారు. ఈ భూముల్లో రోడ్డు వెంట ఉన్న కొన్ని భూములు నాలా కన్వర్షన్ కూడా అనుమతులు పొందారని భవిష్యత్తులో ఇండ్ల నిర్మాణాలు జరిగితే ఈ లైను అత్యంత ప్రమాదకరంగా మారుతుందని అధికారులు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా లైన్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు హనుమారెడ్డి, రవీందర్‌రెడ్డి, చింత అనంతరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరామ్‌రెడ్డి, కాంతమ్మ, ఉపేందర్, గున్నం మాధవి, స్వాతి, కమలమ్మ, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు వేతనాలు మంజూరు చేయాని వినతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

వీఆర్ఏలకు ఐడీకార్డులు, వేతనాలు మంజూరు చేయాలని వీఆర్ఏల రెవెన్యూ డివిజన్ పరిధిలోని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.అనంతరం తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధనా కమిటీ నాయకులు లక్ష్మీమల్ల నర్సింహారావు మాట్లాడుతూ జూలై 23 తారీకున వీఆర్ఏలను వివిధ శాఖలలో సర్దుబాటు చేసిందన్నారు. ఆగస్టు నెల నుండి నేటి వరకు గత ఐదు నెలలుగా వేదనాలు లేకపోవడంతో వీఆర్ఏలు రోడ్డున పడుతున్నారన్నారు.వెంటనే ప్రభుత్వం వివిధ శాఖలలో సర్దుబాటు చేసిన వీఆర్ఏలకు ఐడీకార్డులు ఇవ్వాలని కోరారు.



ఎమ్మెల్యే సామేల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మద్దిరాల

ఇటీవల వల సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలును మంగళవారం కాంగ్రెస్ జిల్లా యువజన నాయకులు యేల్లు అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, నిరుద్యోగ యువత 10 సంవత్సరాల నిర్బంధం నుండి బయటపడిన స్వేచ్ఛ కలిగిందన్నారు.సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వాన సంక్షేమ పథకాలతో పాటు విద్య,ఉద్యోగం, ఆరోగ్య శాఖపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందాలని కోరారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో కుందూరం చంద్రశేఖర్‌రెడ్డి, బొర్ర అరుణ్‌కుమార్ ఉన్నారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-హుజూర్‌నగర్


పట్టణంలోని తపాలా కార్యాలయం ముందు తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పనితో పాటు పెన్షన్ ప్రయోజనాలు అమలు చేయాలని పెయిడ్ లీవును180 రోజులు వరకు నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలన్నారు. టార్గెట్ రూపంలో జీడీఎస్ ఉద్యోగుల అన్ని రకాల వేధింపులను ఆపివేయాలన్నారు. కమలేష్ చంద్రకమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కమీషన్ పద్ధతి రద్దు చేసి జీడీఎస్ లు చేసే ప్రతి పనిని వర్క్ టార్గెట్‌గా తీసుకోవాలన్నారు.సీనియర్ జిఈడిఎస్ ఉద్యోగులకు 12, 24,36 సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లను ఇవ్వాలన్నారు తమ సమస్యలు పరిష్కార అయ్యేంతవరకు తాము సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మగత గోవి, లక్ష్మి, తిరుపతమ్మ, రాము, గీతాంజలి, వెంకటేశ్వర్లు, శ్యామ్,వెంకట్‌నారాయణ,మహేష్, అభినవ్, రాజ,మహేందర్, సత్యప్రకాష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎస్పీ నాగభూషణం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

సాంకేతిక వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ పి.నాగభూషణం అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మండల పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బంది పని తీరు గురించి తెలుసుకొని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలన్నారు.బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించవచ్చున్నారు.పోలీస్ సిబ్బంది పనితీరు ప్రజలకు మరింత చేరువయ్యేలా ఉండాలన్నారు.ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారని అన్నారు.5 ఎస్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది యూనిఫామ్ నీట్‌టర్న్ అవుట్ కలిగి ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, సిబ్బందికి ఏమన్నా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎన్.వెంకన్నగౌడ్, ఏఎస్సైలు వెంకటరత్నం, శ్రీరాములు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమంగా 125 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలింపు

నవతెలంగాణ -తుంగతుర్తి

డీసీఎం వాహనంలో125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సంబంధిత గోడౌన్ కాంట్రాక్టర్ వాహనాన్ని సాయంత్రం స్థానిక పెట్రోల్ బంకులో నిలిపి ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇట్టి పీడీఎస్ బియ్యం ఎక్కడినుంచి ఎటు తరలిస్తున్నారని విషయాలపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాస్తవంగా పిడిఎస్ బియ్యం తరలించేందుకు వాడిన వాహనం ముందు తెలంగాణ ప్రభుత్వం ఉచిత బియ్యం రవాణా అనే బ్యానర్ ఉండాలి. కానీ అవేమీ లేకుండా గోడౌన్ కాంట్రాక్టర్ గోడౌన్ నుండి పిడిఎస్ బియ్యాన్ని డీసీఎం వాహనంలో వేసి ఊరి బయట ఉన్న పెట్రోల్ బంకు వద్ద వాహనాన్ని నిలిపి ఉంచాడు. అట్టి బియ్యాన్ని రాత్రి వేళల్లో మళ్లీ ఫార్ బాయిల్డ్ కు తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తుంది. ట్రక్ షీట్ చూస్తే అది 9వ తారీకు తిరుమలగిరి మండలంలోని మాలిపురం, తొండ గ్రామాలలోని డీలర్లకు చేరవేయాలి అని ఉంది. దీంతో పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు బియ్యంతో కూడిన వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారణ చేస్తున్నారు

పౌరసరఫరాల అధికారి వివరణ

ఈ విషయంపై పౌరసరఫరాల అధికారి వివరణ అడగ్గా గోడౌన్ పాయింట్ నుండి పిడిఎఫ్ బియ్యాన్ని సంబంధిత గ్రామాల డీలర్కు ముందే సమాచారమిచ్చి సాయంత్రం లోపు అట్టి బియ్యాన్ని దిగుమతి చేయాలి .అవేమీ లేకుండా బియ్యాన్ని ప్రైవేటు స్థలంలో ఉంచడం చట్ట విరుద్ధమని అన్నారు . దీనిపై తగు విచారణ చేసి ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించనున్నట్లు తెలిపారు

బునాదిగాని కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం



నవతెలంగాణ-బీబీనగర్

మండలంలోని మక్త అనంతారం బునాదిగాని కాలువను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కాలువ ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క ఆకులని సత్వరమే తొలగించి, రైతులకి ఇబ్బంది కలగకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కుంభం అనిల్ కుమార్



నవతెలంగాణ-భువనగిరిరూరల్

తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల,ఆహార,పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని పౌర సరఫరాల భవన్‌లోని వారి చాంబర్ లో మంగళవారం భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

ఓటర్ జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలి



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె జెండగే

నవతెలంగాణ-భువనగిరిరూరల్

ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే తహసిల్దారులను ఆదేశించారు. మంగళవారం నాడు ఆయన కాన్ఫరెన్స్ హాల్లో తాసిల్దారులతో సమావేశమై ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షిస్తూ జనవరి 1, 2024 ప్రామాణికంగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని, ఓటరు జాబితాలో మరణించిన ఓటర్ల వివరాలు తొలగింపు, ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో ఈనెల 20 వ తేదీ నుండి ఆన్లైన్లో సవరించాలని అధికారులను ఆదేశించారు. చనిపోయిన ఓటర్లు ఉంటే వారి కుటుంబ సభ్యుల నుండి, డూప్లికేట్ ఓటరు అయితే సంబంధిత ఓటరు నుండి దరఖాస్తులు పొందాలని, వంద సంవత్సరాలు పైబడిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో విచారించాలని, ఫోటో సరిగా లేకున్నా ఇంటి అడ్రస్ తప్పు ఉన్నా, కొత్త ఓటరుగా 30 సంవత్సరాల పైబడిన వారిని పాత పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడైనా ఓటు ఉందా అని విచారించాలని, ఫారం -8 ద్వారా దరఖాస్తు చేయించాలని తెలిపారు. జనవరి 6, 2024 ముసాయదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 22, 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, ఫిబ్రవరి 2, 2024 లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8, 2024న తుది ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. పాత భవనాలలో కొనసాగే పోలింగ్ కేంద్రాలను మార్చేందుకు, పోలింగ్ కేంద్రాల పేర్లు తప్పొప్పులు సరిచేసేందుకు, ఒకే లొకేషన్ లో అధిక పోలింగ్ కేంద్రాలు ఉంటే ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటు చేయడం, 1400 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలకు వేరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారి ఉండాలని, ఏదైనా పోలింగ్ కేంద్రంలో లేకపోతే వెంటనే నియమించాలని, బూత్ లెవెల్ అధికారులకు తప్పనిసరిగా బిఎల్ఓ యాప్ పై సరైన అవగాహన ఉండాలని తెలిపారు. కొత్త బూత్ లెవల్ అధికారిని నియమిస్తే అతనిని ఈఆర్ఎంఎస్ డేటాలో అప్ లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, వివిధ మండలాల తహసిల్దారులు పాల్గొన్నారు.

కుంభంకు అపూర్వ స్వాగతం

అడుగడుగున జననిరాజనం

నవతెలంగాణ -భువనగిరిరూరల్

కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా భువనగిరికి రావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రానికి పెద్ద ఎత్తున తరలివచ్చి, ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం పలికారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భువనగిరిలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించుకుంటూ, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు.

కుంభంను కలవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు

మొదటిసారిగా ఎమ్మెల్యే హోదాలో భువనగిరికి రావడంతో మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, పట్టణంలోని గ్రామ శాఖ అధ్యక్షులు ముఖ్య నాయకులు రహదారి బంగ్లాలో కలవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్యంగా గ్రామాల నాయకులు కుంభంతో కలిసి ఫొటో దిగడానికి పోటీపడ్డారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే అందరితో కలిసి ఫోటో దిగారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేని కలవడానికి రావడంతో రహదారి పరిసరాలు జనాలతో కిటకిటలాడయి.



కార్యకర్తలతో పాటు ఇతర నాయకులు ఎమ్మెల్యే ను కలిసిన వారిలో ఉన్నారు.

గౌస్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామంలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా శ్రీ పంచతనయ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శివ స్వాముల బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ యూత్ మాజీ అధ్యక్షులు పాక జహంగీర్ యాదవ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఏడెనిమిది ఏండ్లుగా శివ స్వాముల బృందం ఆధ్వర్యంలో మాలధారన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతినెల అన్నదాన కార్యక్రమం గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ స్వాముల బృందం సభ్యులు భూషబోయిన నరసింహ యాదవ్, రాగిరి బాలరాజు గౌడ్, పాక మహేష్ యాదవ్, నల్లమాసు ప్రసాద్ గౌడ్, గ్రామ పెద్దలు బలుగూరి యాద్ది రెడ్డి, నల్ల మాస్ కుమార్, గడసందుల వెంకటేశం, ఈర్ల వెంకటేశం, పాక పెద్ద శంకర్, చిన్న శంకర్, వడ్డే బోయిన బిక్షపతి,బలుగూరి మధుకర్ రెడ్డి, రాగిరి ప్రసాద్, గ్రామ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాల మార్పు బిల్లు ఉపసంహణ పట్ల హర్షం

నవ తెలంగాణ -భువనగిరి రూరల్

క్రిమినల్ చట్టాల మార్పు కోసం ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంట్లో ఉపసహరించుకోవడం పట్ల ఐలు జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడుతూ క్రిమినల్ చట్టాల మార్పు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ముసాయిదాను పార్లమెంటులో ఉపసహరించుకోవడం, ఈ బిల్లుకు వ్యతిరేకంగా కేంద్ర హోంమంత్రికి వినతి పత్రం ఇవ్వడం, రౌండ్ టేబుల్ సమావేశాలు, విస్తృతంగా న్యాయవాదుల సమావేశాలు, కరపత్రాలు ఐలు ఆధ్వర్యంలో పంచినట్టు తెలిపారు. రాబోయే కాలంలో చట్టాలు రూపొందించే ముందు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయవాద సంఘాలు, బార్లు, బార్ కౌన్సిల్లో, మేధావులతో విస్తృతంగా చర్చ జరిపి బిల్లులను రూపొందించాలన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుక్క దువ్వ సోమయ్య, తడక మోహన్, పాల్వంచ జగతయ్య, సహాయ కార్యదర్శిలు సీసా శ్రీనివాస్, బోల్లెపల్లి కుమార్, చింతల రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి బొడ్డు కిషన్ లు పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-రాజాపేట

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు రాంజీ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అనడానికి ఐలన్న గెలుపే నిదర్శమని తెలిపారు. ఐలన్న ఆధ్వర్యంలో ఆలేరు రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టల్ నాయక్, బాలు నాయక్ ,రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం



నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలో శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి పార్వతీ పరమేశ్వర స్వామివార్ల నాల్గవ వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా గణపతి పూజ, స్వస్తివచనం, ధ్వజారోహణం, రుద్రహోమం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిక్క నర్సింహా, బడుగు శ్రీరాములు, గోశిక నర్సింహా, గోశిక భావనారుషి, సుంచు రాజు, మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్యన్నదానం..

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప దీక్ష మాలదారులకు నిత్యన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీరమల్ల రజనిశ్రీనివాస్‌గౌడ్, గంగాపురం మౌనికకాటంరాజుగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు చెవగోని మహేశ్‌గౌడ్, చెవ్వోజి మల్లేశ్‌చారి, కల్లెం నాగరాజుగౌడ్, బత్తుల మల్లేశ్‌గౌడ్, వంగూరి శ్రీను, మారగోని గణేశ్‌గౌడ్, ఓవల్దాసు నాగేశ్, రాజు, తొర్పునూరి నర్సింహాగౌడ్, సుల్తాన్ రాజు, మేకల అనిల్, చెవగోని గణేశ్, మీసాల శ్రీకాంత్, కట్కూరి కిరణ్‌గౌడ్, పల్లం కిరణ్, సాతిరి రమేశ్, బబ్బూరి రాజు, మంచికంటి శంకర్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలు పక్కా అమలు'

నవతెలంగాణ -బొమ్మలరామారం

తెలంగాణ రాష్ట్రం రెండవ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పక్క అమలు చేస్తారని మాజీ సింగల్ విండో చైర్మెన్ మొకు మధుసూదన్ రెడ్డి అన్నారు.మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆశీస్సులతో ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీను సీఎం రేవంత్ రెడ్డి పక్కా అమలు చేస్తారని స్పష్టించేశారు.రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి పది సంవత్సరాలు మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర తోడ్పడకుండా కుటుంబ అభివృద్ధికి పూనుకున్నారని ఆరోపించారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి పాలనలో స్వచ్ఛ వాతావరణం కలుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయడం ఖాయమన్నారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో పూర్తిస్థాయిలో అమలు చేయడం ఖాయమని ధీమ వ్యక్తం చేశారు.

పెరిగిన మహిళ ప్రయాణికుల రాకపోకలు



నవతెలంగాణ-ఆలేరుటౌన్

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలు ప్రవేశపెట్టగా అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారనే చెప్పాలి. ఆలేరు పట్టణ మీదుగా జనగామ, మహబూబాబాద్ ,తొర్రూరు, హనుమకొండ, వరంగల్ ,భూపాలపల్లి ,పరకాల డిపోలకు చెందిన బస్సులు నిత్యం ఆలేరు పట్టణం మీదగా వందలాదిగా రాకపోకలు వరంగల్ హైదరాబాద్ ప్రధాన నగరాల మధ్య రాకపోకలు సాగిస్తుంటాయి. ఉచిత బస్సు ప్రయాణం రాకతో , మహిళలు ప్రయాణికుల ప్రయాణాలు అమాంతం పెరిగిపోయాయి. 50 వయస్సు పైబడిన మహిళలైతే మనవాళ్లు, మనమరాలను చూసేందుకు, కొడుకు కోడల దగ్గరికి, 30 నుండి 40 వయస్సు పైబడిన వారు,వారి బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు, చదువులు చదివి ఖాళీగా ఉన్నవారు ఉద్యోగాల వెరిఫికేషన్ కోసం ఉద్యోగులకు ఉద్యోగాలకి, పుణ్యక్షేత్రాలకు , తీర్థయాత్రలకు ప్రాధాన్యతనిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు మహిళలు ప్రాధాన్యతనిస్తున్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకునేందుకు రద్దీ పెరిగింది. హైదరాబాద్ వెళ్లే ప్రతి బస్సు బస్సు లో మహిళా ప్రయాణికుల సంఖ్య అమాంతం పెరిగింది. బస్టాండ్ వద్ద బస్సులను పరిశీలించి చూస్తే, బస్సుల లో మహిళా ప్రయాణికులు గంటల తరబడి నిలబడి సైతం ప్రయాణిస్తున్నారు. ఒక బస్సుపై గతంలో దాదాపు 50 వేల రూపాయల వచ్చినట్లయితే ప్రస్తుతం అది కేవలం 10 నుండి 15 వేల రూపాయలకు పడిపోయిందని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. పురుషులు 20 శాతం ఉన్నట్లయితే మహిళలు 80శాతం ప్రయాణిస్తున్నారు. మహిళల నుండి ఉచిత బస్సు ప్రయాణానికి ఊహించని విధంగా స్పందన వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆయా డిపోలకి చెందిన బస్సులే ఆర్టీసీ అధికారులు నడపడానికి ప్రాధాన్యతీస్తున్నట్లు తెలుస్తుంది. బస్సు ప్రయాణం లో భాగంగా కాంట్రాక్టు బస్సులను ఆ డిపోలకు చెందిన అధికారుల అవసరాలను బట్టి, కిలోమీటర్ కి ఇంత అని చెల్లించి బిజీగా ఉన్న రూట్లలో నడుపుతుంటారు.ఉచిత ప్రయాణం కారణంగా కొన్ని బస్సులను రద్దు చేసినట్లు తెలుస్తుంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రధానమైన రూట్లలో బస్సులు పెంచాలని మహిళ ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

'పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'

నవతెలంగాణ-ఆలేరుటౌన్

గత ప్రభుత్వ హయాంలో జరిగిన పేపర్ లీకేజీ పై, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు,బుగ్గ నవీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం హయాంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ఇటు ప్రభుత్వం, అటు టీఎస్పీఎస్సీ అటలాడుకున్నాదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ లో నూతన ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా గతంలో జరిగిన అవకతవకలన్నింటిపైనా కమిటీ వేసి సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోని నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలలో ఉన్నటువంటి ఖాళీలన్నింటిని గుర్తించి, ఏకకాలంలో నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని, ప్రతి సంవత్సరం ఉద్యోగ నియామక క్యాలెండర్ విడుదల చేసి, తద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

వణికిస్తున్న చలి.. తేమ, గాలి అధికం

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాను తెల్లవారుజామున మంచు దుప్పటి కమ్మేస్తుంది. ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి 22 నుంచి 26 డిగ్రీల వరకే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. చలితోపాటు గాలి రావడం ఉనికిస్తోంది వాతావరణంలో తేమ 32 శాతం నుండి 51 శాతం వరకు ఉంటుంది. చలిగాలులు గంటకు ఎనిమిది కిలోమీటర్లు ఇస్తున్నాయి. జిల్లాలో భువనగిరి యాదగిరి వేములవాడ గుట్టలు పొగ మంచుతో నిండి కనబడడం లేదు. తెల్లవారుజామున పొగ మంచు కారణంగా వాహనదారులు తమ వాహనాలను నిలిపి వేసుకుంటున్నారు.

విజృంభిస్తున్న జ్వరం, దగ్గు

వాతావరణంలో చల్లని గాల్లు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు , దగ్గు, గొంతు సమస్యలతో బాధపడుతున్నారు. దగ్గు, శ్వాసకోశ ,జ్వరాలతో ప్రజలు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతుండడంతో వైద్యశాలలు కిటికీటలాడుతున్నాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవడంతో నేబలైజర్ వాడుతున్నారు. తెల్లవారుజామున రాత్రి వేళలో తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

స్వెటర్ల అమ్మకాలు జోరు

చలి తీవ్రత అధికం కావడంతో ప్రజలు చలి నుండి తమను రక్షించుకోవడానికి స్వెటర్లను కొనుగోలు చేయడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. పెద్దపెద్ద షాపులతోపాటు ఫుట్పాత్ల మీద షే ట్టర్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని నర్సాయిగూడెం గ్రామానికి చెందిన రుద్రారం బుచ్చమ్మ అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందడం తో వారి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఎంపిటిసి పసల జ్యోతి విజయానంద్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి వారికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల శ్రీనివాస్, విన్సెంట్ ,స్వామి, ఐలయ్య, బాలస్వామి, సుశీల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్, చెప్పులు పంపిణీ

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ ,మండల ప్రాథమిక పాఠశాలల పిల్లలకు దివీస్ లాబరేటరీ యాజమాన్యం 2,75,400 రూపాయల విలువగల బ్యాగ్స్, శాండిల్ చెప్పులను ఎంపీటీసీ జెల్లా ఈశ్వరమ్మ వెంకటేశం మంగళవారం అంద జేశారు. ఈ సందర్భంగా జెల్లా ఈశ్వరమ్మవెంకటేశం మాట్లాడుతూ దివీస్ యజమాన్యం పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు సహాయ సహకారాలు అందిస్తూన్నా రని అన్నారు.చదువులో రాణిస్తున్న పేద పిల్లలకు స్కాలర్ షిప్స్,స్కూల్ బిల్డింగ్,పాఠశాలలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని దివీస్ యజమాన్యాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఎంపీపీఎస్ పాఠశాలల స్కూల్ కమిటీ చైర్మన్లు కైరంకొండ అశోక్,వర్కాల రఘురాం,మాజీ సర్పంచ్ మాచర్ల కృష్ణ దివీస్ సిఎస్ఆర్ ఇంచార్జ్ వల్లూరి వెంకటరాజు,సాయి కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే స్కాంలు, దోపిడీలు

బీజేపీ జిల్లా అధ్యక్షులు పివిశ్యాంసుందర్

నవతెలంగాణ-భువనగిరి

కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సావు అక్రమంగా ఆధార్కు చెల్లించాల్సిన పన్నులు కూడబెట్టిన డబ్బులు వెలికి తీసిన కొద్ది గుట్ట గుట్టలుగా బయటపడ్డ కాంగ్రెస్ పార్టీలో చలనం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు పివి శ్యాంసుందర్ విమర్శించారు. మంగళవారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు ధీరజ్ సాహూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగరావు, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, మహేందర్ గుప్తా, పిట్టల అశోక్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను కాపాడాలి

బీఎస్పీ మండల అధ్యక్షులు తగరం సుభాష్ చంద్రబోస్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నందుకు మంగళవారం సుభాష్ చంద్రబోస్ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా చౌటుప్పల్ మండలం బీఎస్పీ అధ్యక్షులు తగరం సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది ఆటో డ్రైవర్లకు గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి వాళ్ళ వైపున ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు.ఆటో డ్రైవర్లు వాళ్ళ కుటుంబ సభ్యులు రోడ్డు మీద పడే పరిస్థితి తీసుకోరావద్దన్నారు.ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న 12 వేల రూపాయలు ఇచ్చి జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేకపోతే ఆటో డ్రైవర్ల తరపున బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని నెమిల జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆలేరు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డాక్టర్ జి.కవిత, బోడ జశ్వంత్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య సమస్యలకి పరిష్కారాలు సూచించారు. అనారోగ్య సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని భువనగిరి జిల్లా ప్రభుత్వాస్పత్రికి సిఫారు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు భారతి,ప్రసూన కుమారి,హసనోద్దీన్,మల్లేశం, వైద్య సిబ్బంది ఫార్మసిస్ట్ సంగీత,ఎఎన్ఎంఅనిత పాల్గొన్నారు.

శ్రీ రేణుక దేవాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలం లోని కాచారం మంగళవారం, కైలాస పుర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశ్రమంలో అమావాస్య కార్తీకమాస సందర్భంగా చివరి మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఆలయ ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ధార్మిక పరిషత్ ఐవిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చోలేటి నాగేశ్వరరావు సక్కుబాయి ఆలేరు వాస్తవ్యుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం వారి తల్లిదండ్రులైన కీ"శే చోలెటి భూమయ్య లింగమ్మ పేరు పైన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ వాస్తవ్యులు సత్యనారాయణ అనసూయ, కోడి అరుణ, తేజ, శ్రీనివాస్ నాయుడు, ఆలేరు వాస్తవ్యులు కిష్టయ్య విజయలక్ష్మి, నారాయణపేట వాత్సవ్యులు ఏ.అశోక్ కుమార్ హేమలత, తిరుపతయ్య లత తదితర భక్త బృందం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భువనగిరిరూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించబడు క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో ఎంపిక చేయబడిన క్రైస్తవ అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వంచే గౌరవ సత్కారం పొందేందుకు అర్హులైన క్రైస్తవ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సామాజిక సేవారంగం, విశిష్టమైన వైద్యసేవలు, విద్యాబోధన, సాహిత్యం, కళలు, క్రీడారంగాలలో 5 సం ఏండ్లు పైబడి విశేషమైన సేవలు అందించిన క్రైస్తవులు ,వైద్య, విద్య, సామాజిక సేవారంగాలలో 30 ఏండ్లు పైబడి సేవచేస్తూ ఉన్నటువంటి క్రైస్తవ సంస్థలు గౌరవ సత్కారం అందుకోనుటకు అర్హులు డిసెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నామినేషన్లు www.tscm-fc.in వెబ్‌సైట్‌లోగాని, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయం, భువనగిరి నుండి పొందాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు, సంస్థలు తమ నామినేషన్ నిర్ణీత నమూనాలో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయం, కలక్టరేట్ కాంప్లెక్స్ , మొదటి అంతస్తు రూమ్ నె. F-16, రాయగిరి, భువనగిరి నందు తేది: 15.12.2023 సాయంత్రం 4.00 గం.లోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్: 9505640004 ను సంప్రదించాలని కోరారు.

వేముల గెలుపుతో మొక్కు తీర్చుకున్న పల్లివాడ అభిమానులు

నవతెలంగాణ-రామన్నపేట

నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం అఖండ విజయం సాధిస్తే పల్లివాడ గ్రామం నుండి నార్కట్ పల్లి మండలంలోని చెరువుగట్టు జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకుంటామని మొక్కుకొన్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లేష్, నాగులంచ నరేష్ లు మంగళవారం ఆ మొక్కు తీర్చడానికి గ్రామం నుండి మండల కేంద్రం మీదుగా చెరువుగట్టుకు పాదయాత్రను నిర్వహించారు. ఈ పాదయాత్రకు మునిపంపుల, దుబ్బాక, రామన్నపేట గ్రామాల వేముల వీరేశం అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు శాలువాలతో సత్కరించారు. పాదయాత్ర బృందం ఆయా గ్రామాల్లో ఉన్న అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ యాత్రను సాగించారు. వారి వెంట గ్రామానికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు పాదయాత్రకు తోడుగా నడిచారు. ఈ కార్యక్రమంలో పల్లివాడ గ్రామ సర్పంచ్ కడమంచి సంధ్య స్వామి, జడ్పిటిసి పున్న లక్ష్మీ జగన్మోహన్, మాజీ సర్పంచులు గంగుల వెంకట రాజారెడ్డి, కడారి సత్తయ్య, ఆకవరపు మధుబాబు, నాయకులు గోదాస్ పృథ్వీరాజ్, ఎండి జమీరుద్దీన్, ఎండి అక్రమ్, జేల్లా వెంకటేష్, కూనూరు కృష్ణగౌడ్, కొమ్ము శేఖర్, సాల్వేర్ ప్రవీణ్, పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ నియోజకవర్గానికి నూతనంగా శాసనసభ్యులుగా ఎన్నికైన బత్తుల లక్ష్మారెడ్డికి ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మంగళవారం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు బత్తుల లక్ష్మారెడ్డికి నోట్ బుక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ తన విన్నపాన్ని స్వీకరించి తనకు నోట్ బుక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ బహుమతులను త్వరలోనే పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే వేముల వీరేశంకు సన్మానం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన వేముల వీరేశంను గోపాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశంకు పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు శంభు లింగం యాదవ్, ప్రతినిధులు దుగ్యాల విజయసింహ, సైదులు, బిక్షం, జానయ్య తదితరులు ఉన్నారు.



వనసమారాధనలో .. జయవీర్, పాండురంగారెడ్డి

నవతెలంగాణ-పెద్దవూర

కార్తీక వనసమారాధన ఉత్సవాలలో భాగంగా నాగార్జునసాగర్‌లోని రాజ్‌బహదూర్ వేంకట్రామిరెడ్డి భవన్ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాల కార్యక్రమంలో సాగర్ ఎమ్మెల్యే ఏ కుందూరు జయవీర్ రెడ్డి, శ్రీ వైష్ణవి కన్ స్ట్రక్షన్స్, బుసిరెడ్డి పౌండేషన్ ఛైర్మెన్ పాండురంగారెడ్డి బుధవారం ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక్ వనభోజనాలు ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని మనకు చాటిచెబుతాయని అన్నారు. దేశసంస్కృతి, సంప్రదాయాలను అనుసరించి అనాదిగా వస్తున్న ఎన్నో పర్వదినాలను మనం పాటిస్తూ వస్తున్నామని తెలిపారు. ఇందులో భాగమే కార్తీక మాసంలో జరుపుకునే వన సమారాధన కార్యక్రమం అని అన్నారు. భారతీయ ఆయుర్వేదంలో వృక్ష జాతికి ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు.ఆటలు, పాటలు కబుర్లకు ఇది చక్కటి వేదిక అన్నారు. పిల్లలు, పెద్దలలో ఉన్న సృజనాత్మకతను తట్టిలేపే క్రీడలు, నృత్యాలు, సంగీత కచేరీలు నిర్వహించడానికి మంచి అవకాశం ఉందన్నారు. మానవ మనుగడకు వనాలు చేసే మేలు అంతా ఇంతా కాదన్నారు. భవిష్యత్ తరాలకు కూడా మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షించాలనే నిగూఢ సందేశాన్ని వనసమారాధన అందిస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి,తిరుమలగిరి సాగర్ మండలం వైస్ యంపిపి యడవల్లి దిలీప్ రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ జనార్ధన్ రెడ్డి,తేరా రంగారెడ్డి, మల్గిరెడ్డి



లింగారెడ్డి, మాజీ యంపిపి తిరుమలనాథ గుడి చైర్మన్ బుర్రి రామిరెడ్డి,రాయపురెడ్డి సత్యనారాయణ రెడ్డి, కంకణాల భాస్కర్ రెడ్డి, వంగాల భాస్కర్ రెడ్డి,పల్ రెడ్డి లక్ష్మారెడ్డి మరియు రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలి



నవతెలంగాణ-నల్గొండకలెక్టరేట్

రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు జరిగినప్పటి నుండి శరవేగంగా సమీక్షలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి తెలంగాణ విద్యారంగంపై సమగ్ర సమీక్ష జరిపి విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్ అన్నారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బిఆర్ యస్ రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగడం ఆడిందని నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐనా స్పందించి తక్షణమే స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగంలో జరిగిన అవినీతి, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు- మనబడిలో చాలా లోపాలు జరిగాయని వాటిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ప్రభుత్వం నిత్యం సంక్షేమ రంగంలో ముందున్నామని చెప్పుకున్నా ఆచరణ లో పూర్తి విరుద్ధంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన సుమారు 7నెలలు గడిచిన ఇప్పటికీ నయా పైసా విడుదల చేయకుండా వుంటే సంక్షేమ హాస్టల్లో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం ఎలా అందుతుందని ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలను నడుపుతున్న హెచ్ డబ్ల్యు ఓ లు సైతం ఆత్మహత్య చేసుకున్నే స్థాయికి గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పాలనా కొనసాగించిందని విమర్శించారు. తక్షణమే పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులను దృష్టిలో ఉంచుకొని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని గత ఏడు నెలలుగా బకాయిలో ఉన్న మెస్ ఛార్జీలు విడుదల చేయాలని అన్నారు.సంక్షేమ హాస్టళ్ళ కు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గురుకుల విద్యార్థుల పరిస్థితి చాలా దారుణమైన స్థితిలో ఉన్నాయి. వాటికి సొంత భవనాల నిర్మాణానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ విధానంలో అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉన్నది. ముఖ్యంగా పరీక్షల ఫీజుల పేరుతో ఒక్కొక్క సెమిస్టర్ కు ఒక్కొక్క విద్యార్థి 3000 రూపాయలు చొప్పున పరీక్షల ఫీజుల రూపంలో చాలా ఇబ్బందులు గురవుతున్న పరిస్థితి ఉన్నది. ఈ విషయంపై ఉన్నత విద్యా మండలితో చర్చించి విద్యార్థుల పరీక్ష ఫీజుల విషయంలో పునరాలోచించాలని అన్నారు. ప్రయోగాలకు నిలయమైన యూనివర్సిటీ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆ సమస్యలను కూడా పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యలకు పరిష్కారం దిశగా నూతన ముఖ్యమంత్రి చొరవ తీసుకొని తక్షణమే విద్యా శాఖ మంత్రిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కోరె రమేష్,సాయి, శివ, ప్రసాద్ రెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



సీతక్కకు మేడి హరికృష్ణ శుభాకాంక్షలు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన సామాజిక వేత్త జిల్లా యువజన సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి మేడి హరికృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుని కుటుంబ సభ్యులకు అన్నదానం

నవతెలంగాణ-పెద్దవూర

నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం కోమటికుంట తండాకు చెందిన రమావత్ దిప్లానాయక్(60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. వారి అంత్యక్రియల్లో చివరి చూపు చూసేందుకు వచ్చిన బంధు మిత్రులకు పులిచెర్ల ఆడబిడ్డ భారతీయ జనతా పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జి, ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంకణాల నివేదితరెడ్డి దాదాపు 150 మందికి తన ఫౌండేషన్ ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అసెంబ్లీ కన్వీనర్ పాల్తి శంకర్ నాయక్, రమావత్ రవి నాయక్, రమావత్ బీకోజి నాయక్, రమావత్ ఫుల్ సింగ్ నాయక్, బానావత్ మోతీలాల్ నాయక్, ముడావత్ సక్రు నాయక్, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు చిట్యాలలో జిల్లా స్థాయి చెస్ పోటీలు

నవతెలంగాణ-చిట్యాల టౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి చెస్ పోటీలు డిసెంబర్ 14న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాలలో నిర్వహించబడునని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాల నుండి 17 సంవత్సరాలలోపు గల బాల బాలికలకు చెస్ పోటీలు నిర్వహించబడునని ఈ పోటీలకు ఆర్బిటర్‌గా కే కరుణాకర్ రెడ్డి, జిల్లా స్కూల్స్ గేమ్స్ కార్యదర్శి వాసుదేవరావు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో సూర్యాపేట, భువనగిరి, నల్లగొండ జిల్లాల నుండి 60 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.



పాదయాత్రకు చిట్యాలలో ఘన స్వాగతం

నవతెలంగాన-చిట్యాలటౌన్

నకిరేకల్ మండలం పాలెం గ్రామం నుంచి యువజన కాంగ్రెస్ నాయకులు యాదగిరిగుట్ట వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం చిట్యాలకి చేరుకుంది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వేముల వీరేశం అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా వారి అభిమానులు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నారు. చిట్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జంపాల వెంకన్న, జిట్ట చిన్న స్వామి తదితర నాయకులు వారికి ఘన స్వాగతం పలికి అభినందించారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-మునుగోడు

గ్రామీణ ప్రాంతాలలో తపాల సేవలందిస్తుల గ్రామీణ తపాల ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐజిడిఎస్‌యు, ఎన్‌యుజిడిఎస్ కేంద్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తపాల కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, మండల కార్యదర్శి ఆర్ యాదగిరి స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫారసులన్నీటిని 2016 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 5 లక్షల కవరేజ్ గ్రూప్ ఇన్సూరెన్స్, ఐదు లక్షల గ్రాట్యుటీ పెంచాలని కోరారు. బిజినెస్ టార్గెట్ల పేరుతో జిడిఎస్ లపై వేధించే పద్ధతులను నిలిపివేయాలి అని అన్నారు.



తమకు న్యాయమైన డిమాండ్ల పరిష్కారమయ్యేంతవరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి దుర్గా భవాని, జి అరుణ, బి నగేష్, ఎస్ దివ్య, బి అనిత, బి యాదయ్య, వి గణేష్, బి లావణ్య, డి సింధు లహరి, జి నరసింహ తదితరులు ఉన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే వీరేశం



నవతెలంగాణ-చిట్యాల టౌన్

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి, ఏపూరు గ్రామాలకు చెందిన పలువురిని మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. ఏపూరు గ్రామానికి చెందిన పాలెం వెంకటేశం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతనిని పరామర్శించి ఆరోగ్య వివరాలను తెలుసుకొని ఆర్థిక సహాయం చేశారు. అలాగే అనారోగ్యంతో మరణించిన కొండే లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. గుండ్రంపల్లికి చెందిన రెడపాక రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రెడపాక యోగానంధంను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీ నరసింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటం వెంకటేశం, బట్టు ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

నందికొండ అభివృద్ధే లక్ష్యం : కమిషనర్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ అభివృద్ధియే తన ఏకైక లక్ష్యమని నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నందికొండ మున్సిపాలిటీలో కౌన్సిలర్లతో వార్డులలో పేర్కొన్న చెత్తాచెదారం, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించిన వెంటనే కమిషనర్ సిబ్బందితో మూడోవార్డులో కంప చెట్లు తొలగింపు మరియు ఐదో వార్డులో డ్రైనేజీ చాంబర్ల క్లీనింగ్ పనులు చేపట్టారు. తదనంతరం కమిషనర్ మాట్లాడుతూ నందికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు మరియు ప్రజల సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని వార్డులలో పేర్కొన్న వివిధ



సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డ్ కౌన్సిలర్ రమేష్ జి,మూడో వార్డు కౌన్సిలర్ శిరీష మోహన్ నాయక్, పెద్దవుర ఎంపీపీ ముఖ్య సలహాదారుడు సుందర్ రెడ్డి, పరిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌రెడ్డిని పరామర్శించిన దైద రవీందర్

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని నోముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సామ రవీందర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యారు. ఈ విషయం తెలుసుకొని మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ గాయాలపాలైన సామరవీందర్ రెడ్డిని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి యాస కరుణాకర్ రెడ్డి, కందాల వెంకటరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనుకుల అనిత శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్, సోమయ్య, శీను, సురేందర్ రెడ్డి, రాజు ఉన్నారు.

మహిళలతో కిక్కిరిసిపోతున్న బస్సులు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. ఒక్కొక్క బస్సులో 80 మందికి పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆర్టీసీ బస్టాండు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మహిళలతో సోమవారం కిక్కిరిసిపోయింది. కార్తీక మాసం చివరి సోమవారం అమావాస్య ముందు రోజు కావడంతో మండల పరిధిలోని చెరువుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. చెరువుగట్టులో వేలాది మంది మహిళలు బస్సుల కోసం రోడ్లపై నిరీక్షణ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బస్సులతో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వలన మహిళలంతా ప్రైవేట్ వాహనాలలో ప్రయాణించడం మానుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడంతో బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. సుదూర ప్రాంతాలకు నాన్ స్టాప్ బస్సులో వెళ్లే మహిళలు సైతం 33శాతం రిజర్వేషన్ తగ్గిందని, ఉచిత ప్రాణానికి ఆసక్తి చూపుతున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణం లాభదాయకంగా ఉందని మహిళలు పేర్కొంటున్నారు. ఈ పథకాన్ని సంపూర్ణంగా విజయవంతం చేసేందుకు ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచాలని మహిళలు కోరుతున్నారు. బస్సులలో మహిళా సంఖ్య పెరగడం పురుషుల సంఖ్య తగ్గిపోవడంతో ఆదాయం కూడా తగ్గుముఖం పట్టింది. ఆర్టీసీకి వచ్చే ఆదాయంలో సగం డబ్బులు కూడా రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

'తనిఖీల్లో రూ.350కోట్లు.. కాంగ్రెస్ అవినీతికి పరాకాష్ట'

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

దేశ చరిత్రలోనే ఐటీ అధికారుల చేసిన తనిఖీల్లో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహు ఇంట్లో రూ.350 కోట్లు దొరకడం కాంగ్రెస్ అవినీతికి పరాకాష్ట అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్ ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం బీజేపీ నాయకులు పట్టణంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దు విషయంలో నీతులు పలికిన సదరు కాంగ్రెస్ ఎంపీ ధీరజ్‌సాహు తన అక్రమ సంపాదనతో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు ఖర్చు చేయడం సిగ్గు చేటని అన్నారు. అవినీతిపరుడైన ఎంపీ ధీరజ్‌సాహును సమర్థిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. దేశ ప్రజల సొమ్మును దోచుకుంటున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ సాహుపై వెంటనే కేంద్ర ప్రభుత్వం



చర్యలు తీసుకోని రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యామ్, బంటు గిరి, సీతారాంరెడ్డి, హనుమంతరెడ్డి, రాంచంద్రారెడ్డి, అశోక్‌రెడ్డి, రాజిరెడ్డి, వేణు, రమణ, బాషా, భరత్, సైదులు, అశోక్‌రెడ్డి, పోరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థికసాయం



నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన నల్లవెల్లి వెంకటయ్య మంగళవారం ఉదయం ఆకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాంపల్లి జెడ్పిటిసి ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి మృతుని నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా అదే గ్రామానికీ చెందిన పంబాల చంద్రయ్య పార్వతమ్మ దంపతులు మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న జెడ్పిటిసి వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనవెంట మండల కోఆప్షన్ సభ్యులు ఎస్.కె అబ్బాస్, పసునూరు మాజీ సర్పంచ్ సలువాది రాములు, గ్రామ వార్డు సభ్యులు రంగయ్య, షేక్ జానీ, ధనంజయ చారి, సైదిరెడ్డి, నిరంజన్, పంబాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయవీర్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-త్రిపురారం

సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి విజయం సాధించి ఎమ్మెల్యేగా జయవీర్ మంగళ వారం త్రిపురారంకు రావడంతో.. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ళ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యేకు. శాలువాలు పూల దండలు వేసి అందరూ శుభాకాంక్షలు తెలిపారు. తమ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి నియోజకవర్గంకు రావడంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన్ను కలిసి అభినందనలు తెలపడం కోసం పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ భారతి, జిల్లా మహిళా పార్టీ అధ్యక్షురాలు మాధవి, కార్యనిర్వాహక అధ్యక్షుడు బిట్టు రవి, మండల కో అప్షన్



సభ్యుడు హుస్సేన్, అనుముల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

చెరువుగట్టులో కిక్కిరిసిన భక్తజనం



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని చెరువుగట్టులో గల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తీక మాసం చివరి రోజు అమావాస్య కావడంతో అంతర్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా ప్రత్యేకంగా దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాంగణం అంతా మహిళలతో కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ లక్ష పుష్పార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సిరికొండ నవీన్ భక్తులకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చారు. వేడుకల్లో సిబ్బంది ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా జానారెడ్డి

నవతెలంగాణ-పెద్దవూర

ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం రామన్న గూడెం గ్రామానికి చెందిన నక్కల జానారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 7 నుండి 10 తేదీవరకు ఢిల్లీలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన 69వ ఏబీవీపీ జాతీయ మహాసభలు పదివేల మంది విద్యార్థి ప్రతినిధులతో 42వ రాష్ట్ర మహాసభలు మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన సభలో ఎంపిక చేశారు. నక్కల జానారెడ్డి హైదరాబాద్‌లో ప్రస్తుతం పటాన్చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చరిత్ర విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.



1999 నుండి విద్యార్థి పరిషత్ కార్యకర్తగా పని చేశారు. ప్రపంచంలో అతి పెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీలో పని చేయడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి తాను అధ్యక్షులు నియామకం కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. జాతీయ భావంతో జాతీయ పునర్నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. తన పైన విశ్వాసం తో బాధ్యతను ఇచ్చిన రాష్ట్ర శాఖకు, అఖిల భారతస్థాయి అధికారులకు, కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం సంస్థ కోసం, సమాజం కోసం పని చేస్తానని, సదా భరతమాత సేవలో కొనసాగుతానని పేర్కొన్నారు. తన ఎన్నిక పై విద్యార్థి పరిషత్ కార్యకర్తలు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని పహిల్వాన్ పురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, వనగంటి రమేష్ , వేలిమినేటి నారాయణరెడ్డి, వనగంటి జహంగీర్, ఎలిమినేటి బుచ్చిరెడ్డి,వల్లపు శ్రీకాంత్, అరవింద్, సంపత్ పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు

నవతెలంగాణ-బొమ్మలరామారం

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షులు,సుర్వి యాదయ్య గౌడ్,ఉపఅధ్యక్షురాలు తిరుమల కవితవెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బొమ్మలరామారం మండల సర్పంచులు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నూతనంగా మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టినందుకుగాను మంత్రి సీతక్కను తన నివాసంలో కలిసి ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు మేడబోయిన గణేష్, మర్యాల సర్పంచ్ దామోదర్ గౌడ్,మైసిరెడ్డి పల్లి సర్పంచ్ రమాదేవి రాంరెడ్డి,అల్లాపురం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,ఎల్లం బావి సర్పంచ్ కొండల్, తదితరులు పాల్గొన్నారు.



ఆలేరును అభివృద్ధి చేసుకుందాం

నవతెలంగాణ-గుండాల

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు.యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనంతారం గ్రామం నుండి భారీ బైక్ ర్యాలీతో గుండాలకు చేరుకున్నారు.మంగళవారం మండల కేంద్రంలోని హేమావతి ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి అధ్యక్షతన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండాల మండలాన్ని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానన్నారు. మండల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.కలలు కన్న తెలంగాణ ఏ లక్ష్యంతో సోనియమ్మ ఇచ్చిందో ఆ కల ఇవ్వాలా ప్రజల సహకారంతో సిద్ధించిందన్నారు.కేసీఆర్ అన్న తెలంగాణ పేదోడికి విద్య వైద్యం అందినప్పుడే బంగారు తెలంగాణ అభివృద్ధి చెందినట్లని అది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమన్నారు.



ఆలేరుకు గుండెకాయ లాంటి గుండాల మండలాన్ని నాయకుడిగా కాదు సేవకుడిగా సేవ చేసే అవకాశం కల్పించారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడెపు సంజీవరెడ్డి, జిలాఉపాధ్యక్షుడు కోలుకొండ యాదగిరి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరుపు యాదగిరి గౌడ్,సింగిల్ విండో చైర్మన్ లింగాల భిక్షం సర్పంచులు తుమ్మ డెన్నిస్ రెడ్డి,చిందం వరలక్ష్మి ప్రకాష్,ఎంపీటీసీ కొర్న నరేష్ మహిళా నాయకురాలు కొండూరు విశాలాక్ష్మి,రావు హరిత దేవి నాయకులు నూనెముంతల వెంకటేశ్వర్లు,కుమ్మరికుంట్ల రాజారత్నం,బండారి వెంకటేష్,పోన్నగాని నారాయణ,ఎండీ శర్ఫోద్దీన్,ఇమ్మడి దశరథ,సింగారం ఉప్పలయ్య,సూదగాని రామచంద్రయ్య,సిరాజుద్దీన్,అన్నెపర్తి యాదగిరి,పొడిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారులతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమీక్షా సమావేశం

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ అధికారులు అందరూ కలసి మెలిసి ఇష్టంతో విధులు నిర్వహించి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొని రావాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం మండలంలోని అధికారులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను సన్మానించారు.ఈ సందర్భంగా గుండాల ఎంపీపీ తాండ్ర అమరావతి శోభన్ బాబు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు పలు అభివృద్ధి పనులను చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

యాసంగి సీజన్‌లో..

పంటల సాగు వివరాలను నమోదు చేయాలి

- **కలెక్టర్ ఎస్ వెంకట్రావు**

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



యాసంగి 2023-24 సీజన్‌కుగాను సూర్యాపేట జిల్లాలోని పంటల సాగు విస్తీర్ణ నమోదు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు.మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు ఉద్యాన అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాసంగి సీజన్‌లో మండలాలవారీగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు పకడ్బందీగా జరగాలని తెలిపారు.వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలోని రైతుల సర్వే నెంబర్ల వారీగా వ్యవసాయ ఉద్యాన పంటల సాగు వివరాలను క్రాఫ్ బుకింగ్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.వ్యవసాయ విస్తరణఅధికారులు రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని,వాణిజ్య పంటలసాగు పై కూడా రైతులకు అవగాహన కల్పించి వారిని మానసికంగా సిద్ధం చేయాలన్నారు.ఆయిల్ సాగును మరింత ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్, డీఈవో రామారావునాయక్,సీపీఓ వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వీరేశంకు సన్మానం

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన వేముల వీరేశం ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు రేపాల సతీష్, ఉపాధ్యక్షుడు కందగట్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ రామ సాయిలు, కోశాధికారి యరకల శాంతి కుమార్, సభ్యులు ఎస్ రమేష్ పాల్గొన్నారు.

వీరేశంను ఆశీర్వదించిన అర్చకులు

అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన వేముల వీరేశం దంపతులను పట్టణానికి చెందిన అర్చక సంఘం నాయకులు మంగళవారం కలిసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బహదూరుపేట గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పురపాలక సంఘంలోని ఆరవ వార్డు బహదూర్ పేట ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే, బీర్ల ఐలయ్య ను నివాసం వద్ద కలసి వినతి పత్రం అందజేశారు.ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డ్ బహదూర్ పేట, గతంలో గ్రామపంచాయతీ గా ఉన్నదని గుర్తు చేశారు. బహదూర్ పేట మున్సిపాలిటీలో విలీనం అయిన మూలంగా, బహదూర్ పేట ప్రజలు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. తిరిగి వెంటనే బహదూర్ పేట ని గ్రామ పంచాయతీ గా చేయాలనీ ఎమ్మెల్యే ఐలయ్య దృష్టికి తీసుకువెళ్లారు. దానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఎమ్మెల్యేని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ కూల నరసింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కూల సిద్ధులు, వట్టిపల్లి సిది మల్లయ్య పాల్గొన్నారు.

చీ.. చీ రోడ్లు

- **రాచకొండలో సీసీరోడ్ల పరిస్థితి**

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



మండలంలోని రాచకొండ తండాలో నాణ్యత లోకంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆ తండా గిరిజనులు చీ కొడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు రోడ్లను నాణ్యత లోపంగా నిర్మించినట్లు ఆరోపిస్తున్నారు.రోడ్లు నిర్మించి నెల రోజులవుతున్న పక్కల వెంట మట్టి పోయకపోవడం వల్ల వాహనం దారిలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.అదేవిధంగా నాణ్యత లోపం వల్ల నిర్మించడంతో హర్యానాయక్ ఇంటి ముందు నిర్మించిన సీసీ రోడ్డు నెర్రలుబారీ పోయిందని గిరిజనుల ఆరోపిస్తున్నారు.సంబంధిత శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని తండా గిరిజనులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని సిసి రోడ్లకు ఇరుపక్కల మట్టి పోయించడంతో పాటు నాణ్యత లోపం గా నిర్మించిన సిసి రోడ్ల స్థానంలో నూతన రోడ్లను నిర్మించాలని కోరుతున్నారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆ తండ గిరిజనులు కోరుతున్నారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికల నిర్వహించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు బహిరంగ లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచారని, పొందుపరిచిన ప్రకారం రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్లపై స్పష్టత లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని జాజుల లేఖలో పేర్కొన్నారు.రిజర్వేషన్ల పెంపు వల్ల మున్సిపాలిటీ, పంచాయతీలో 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,జంగిలి వెంకన్న యాదవ్,రాంబాబు యాదవ్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

అల్లం కిరణ్‌కుమార్ 16వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక లోటస్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు వ్యవస్థాపకులు కేతనపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి (ఈ నెల 13వ తేదీన) మధ్యాహ్నం ఒంటిగంట నుండి 4 గంటల వరకు లోటస్ హైస్కూల్ హనుమాన్ పేట ఫ్లై ఓవర్ దగ్గర గల పాఠశాలలో వర్ధంతి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్లం రాజయ్య, అల్లం నారాయణ, మట్టిమనిషి వేనెపల్లి పాండురంగారావు, విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, విద్యావంతులు, మేధావులు మొదలగువారు హాజరవుతారని వారి చేత గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం ఉంటుందని అన్నారు. వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు అందరూ తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

కేసీఆర్ లేని పాలనను ఊహించుకోలేకపోతున్న ప్రజలు

- **సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి**

నవతెలంగాణ-సూర్యాపేట

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దేశంలో నే నెంబర్ వన్ గా తీర్చిదిద్దిన కేసీఆర్ నాయకత్వం లేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేక పోతున్నారని విద్యుత్ శాఖ మాజీ మంత్రి,శాసనసభ్యులు గుంటకండ్ల



జగదీశ్‌రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.జోగులాంబ నుంచి ఆలంపూర్ వరకు అందరూ బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలయినప్పటికీ సూర్యాపేట మాత్రం బొగ్రాయిలా నిలిచి గెలిచిందన్నారు. మళ్లీ ఎన్నికల వరకు ఒక్కటి లేకుండా అన్ని గెలుస్తామన్నారు. మంచి కోసం నిలబడి త్యాగాలకు సిద్ధపడిన చరిత్ర సూర్యాపేట ప్రజలదని అందుకు నా ఈ గెలుపే నిదర్శనం అన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జరిగిన లోటుపాట్లను ఆలోచన చేసుకావాలని అవి మరల పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు కుట్రపూరితంగా పదేండ్లపాటు అధికారంలో ఉన్నారని, ఒక వాదన తీసుకువచ్చి తప్పుదోవ పట్టించారని తెలిపారు.రెండుసార్లు తెలంగాణలో అధికారం ఇస్తే కెసిఆర్ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా చేశారని పేర్కొన్నారు. ప్రజలు మనకు ప్రతిపక్ష బాధ్యతను ఇచ్చారని, ప్రజల ఆలోచనలతో నిర్ణయాలు తీసుకొని ముందుకు పోవాలన్నారు. మనం ముందుగా అనుకున్నట్లుగానే చిల్లర వేషాలు మొదలయ్యాయని ఇవి మన నల్లగొండలో ముఖ్యంగా సూర్యాపేటలో అధికంగా ఉంటాయన్నారు. కేసీఆర్ కొట్లాటలు గొడవలు ఉండొద్దని అవి అభివృద్ధికి ఆటంకాలని పదేండ్లుగా ప్రశాంతంగా ఉంచారాని గుర్తు చేశారు. ఎన్నికల ముందే నేను చెప్పినట్లుగానే వృద్ధ సింహం గాండ్రిస్తుందని అసెంబ్లీకి పోకున్నా, అన్ని చేస్తామని అంటున్నాడని ఎలా చేస్తాడు ఏం చేస్తాడు? నాలా 24 గంటలు కష్టపడి నాతో కలిసి నాలుగు గంటలకు లేస్తాడా అని ఎద్దేవా చేశారు. సూర్యాపేట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ఆలోచనతో డివైడర్ కట్టించామని ఇప్పుడు ఆ డివైడర్లు తొలగించి రోడ్డు ప్రమాదాలకు కారకులు కాబోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ డిసెంబర్ 9న రైతుబంధు ఇస్తామని ఇవ్వలేదని తాము ఇస్తామంటే ఈసీకి ఫిర్యాదు చేశారని ఇప్పుడు పాత పద్ధతి వేస్తామని అంటున్నారని తెలిపారు.విద్యుత్ ఇవ్వడం చేతకాక దాని నుంచి తప్పించుకునేందుకు అప్పులు చేశారని అంటున్నారని అసెంబ్లీలో నన్ను అడిగితే దానికి సమాధానం నేను చెప్పేవాడినన్నారు.గత ప్రభుత్వాల్లో 6, మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అయితే ఇప్పుడు 18 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నామని, అప్పుడు జెన్‌కో ఆస్తులు రూ. 18 వేల కోట్లు అయితే ఇప్పుడు రూ.50 వేల కోట్లు అయ్యాయని వివరించారు. ఇప్పుడొచ్చింది ఆరు గంటల కరెంటు అయితే ఇప్పుడు నేను ఇచ్చేది 24 గంటల కరెంట్ అని అన్నారు. చేసేందుకు దమ్ము, ధైర్యం ఉండాలని సాకులు చెబితే నడవదన్నారు.అసెంబ్లీలో చర్చ వాళ్ళు పెట్టడం కాదు నేనే పెట్టి ఉన్నది ఉన్నట్టుగా చెబుతానన్నారు.

రెడ్ క్రాస్ మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌ను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-భువనగిరిరూరల్

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ మెడికేర్ యూనిట్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీకి అందజేసిన నూతన మొబైల్ టెస్టింగ్ వ్యాన్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ జెడాంగే ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 60 సం.లు పైబడిన వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి ఉచితంగా మందులు అందచేయడం అభినందనీయమని తెలిపారు. జిల్లాలో రెడ్ క్రాస్ కార్యక్రమాలను విస్తృతపరచాలని, అలాగే వీలైనన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించాలని సూచించారు. రెడ్ క్రాస్ చేపట్టబోయే కార్యక్రమాలలో తాను తప్పకుండా పాల్గొనే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ జి లక్ష్మీనరసింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ కమిటీ అధ్యక్షులు సద్ది వెంకటరెడ్డి, జిల్లా కమిటీ డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ, జంపాల అంజయ్య, రెడ్ క్రాస్ సభ్యులు ఎస్పీ యుగంధర్ రావు, స్పందన, రామ్ రెడ్డి, విజయ్ కుమార్, జయలక్ష్మి మచ్చందర్ పాల్గొన్నారు.



పెన్షన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ అందేలా ,రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బొమ్మకంటి బాలరాజు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఆలేరు పట్టణంలో మంగళవారం టీఎన్జీవో భవనంలో ఆల్ పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ తేదీ వచ్చినప్పటికీ, నేటి వరకుఅనేక జిల్లాల లో విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పెన్షనర్లకు, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వమైన సకాలంలో పెన్షన్లు మంజూరు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్య పరిస్థితులు బాగా లేక, దవాఖానాల్లో ఈహెచ్ఎస్ కార్డులు పనిచేయక ,చేతిలో డబ్బులు లేక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఈ నెల 23 న పెన్షనర్స్ డే భువనగిరిలో నిర్వహిస్తున్నందున ,పెన్షనర్లు పెద్ద ఎత్తున హాజరై ,విజయవంతం చేయాలనికోరారు.ఈ సమావేశంలో పోతుగంటి రాజయ్య ,వి .యాదగిరి , శంకర్ రెడ్డి, బాలేశ్వర్, రమేష్ బాబు, జి లక్ష్మీనారాయణ ,బుగ్గయ్య యాకుబ్ పాష, డి. ఆగయ్య ,సివి .రామనర్సయ్య, జి. రామచంద్రయ్య ,డి. నరసయ్య సుధాకర్ రెడ్డి, అంజయ్య ,ఎండి. అలీముద్దీన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నూతన గ్రామపంచాయతీల ఏర్పాటుకు కసరత్తు పూర్తి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పురపాలక సంఘంలోని రెండో వార్డు సాయి గూడెం గ్రామపంచాయతీ ఏర్పాటుకు,గత అసెంబ్లీ సమావేశాలలోనే తీర్మానం జరగగా, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులు, స్థానిక అధికారులను సాయి గూడెం గ్రామానికి సంబంధించిన వివరాలను కోరడంతో స్థానిక అధికారులు నివేదిక పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏడు నూతన గ్రామపంచాయతీలో ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 500 పైబడి జనాభా ఉన్న నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పూనుకుంది. అందులో సాయి గూడెం జనాభా 976 గా నమోదయి ఉంది. ఆలేరు, తుర్కపల్లి, బొమ్మలరామారం, మోటకొండూరు మండలాలలో 7 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి.

వడ్లు చోరీ

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని దుబ్బాక గ్రామ వడ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇద్దరు రైతులకు సంభంధించిన వడ్ల రాశులలోని వడ్లు చోరీకి గురైన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక గ్రామానికి చెందిన రైతులు మేడి మల్లయ్య మెడబోయిన వెంకన్న అమ్మకం కోసం మార్కెట్ లో రాశిగా పోసిన రెండు వడ్ల కుప్పల నుండి గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం చోరీ చోరీకి పాల్పడ్డారు. రైతు తన రాశి (కుప్ప) దగ్గరకి వెళ్లి పరిశీలించగా తన రాశిలోని వడ్లు చోరీకి గురైనట్లు గమనించి సమీపంలో ఉన్న రైతులను పిలిచి చూపించగా పక్కన ఉన్న ఇంకో రాశిలో కూడా చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధిత రైతులు ఇద్దరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. 120 బస్తాల ధాన్యం చోరీ గురైనట్లు రైతులు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న రామన్నపేట ఎస్సై లక్ష్మయ్య చోరీ ప్రాంతాన్ని పరిశీలించారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో మంగళవారం అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్స్ పోటీలను స్పోర్ట్స్ సెక్రటరీ డా. జి ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. తుది ఫలితాలను బుధవారం (నేడు) వెల్లడించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా రామావత్ మురళి, పి డి లు కదారి వెంకటేష్, పాండు, తదితర అధ్యాపకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన భిక్షమయ్యగౌడ్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల తన స్వగృహంలో కాల్ జారి పడి హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్యగౌడ్‌పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కెసిఆర్ తనయుడు కేటీఆర్ ని మాజీ సీఎం ఆరోగ్య పరిస్థితి గురించి చర్చించారు. ఏంటా తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదారి కిషోర్ స్వామి గౌడ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.